రూ.10 కోట్ల విలువైన స్థలంలో ఆక్రమణల తొలగింపు

- కూటమి నేతే ఆక్రమణలకు సూత్రధారి
- 'సాక్షి'లో ప్రచురించిన కథనాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం


వుడా కాలనీ రమ్య ప్యారడైజ్ వద్ద పొక్లెయిన్‌తో షెడ్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది


మధురవాడలోని ప్రభుత్వ హాస్టల్ స్థలంలో పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది


వుడా కాలనీ పార్కు స్థలంలో షెడ్లను పరిశీలిస్తున్న ఆర్ఐ ప్రవీణ్ కుమార్, తదితరులు


వుడా కాలనీ పార్కు స్థలంలోని ఆక్రమణలు పొక్లెయిన్‌తో తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ : రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు భూ ఆక్రమణలపై స్పందించారు. విశాఖ రూరల్ మండలం మధురవాడలో శనివారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు ప్రారంభించారు. ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మధురవాడ, వుడా కాలనీల్లో సుమారు రూ.10 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత మధురవాడ సమీపంలోని శ్రీలక్ష్మీనగర్, మారికవలస ఆర్‌జీకే కాలనీ వద్ద శారదానగర్, మధురవాడ వికలాంగుల కాలనీ, చంద్రంపాలెం–ఎన్‌జీజీవోస్ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ కృష్ణా కోఆపరేటివ్ సొసైటీ లే అవుట్‌లో ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని, ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఇటీవల సాక్షి పత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు. 277/1లోని శ్రీ కృష్ణనగర్ లే అవుట్‌లో ల్యాండ్ సీలింగ్ ద్వారా సంక్రమించిన వ్యవసాయ మిగులు భూమి 200గజాల్లో కొందరు షెడ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో రమ్య ప్యారడైజ్ వద్ద సుమారు రూ.4 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమితోపాటు చంద్రంపాలెం – వుడా కాలనీ వద్ద ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్న వ్యవహారంపై ఈ నెల 22న ఆగని ఆక్రమణల పర్వం అనే శీర్షికతో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనాలకు రెవెన్యూ అధికారులు స్పందించారు.

తీగ లాగితే.. కదిలిన డొంక

తీగ లాగితే డొంక కదిలిన చందంగా మధురవాడ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలపై రెవెన్యూ అధికారులు ఆరా తీశారు. దీంతో కేవలం వుడా కాలనీ వద్ద కృష్ణానగర్ లే అవుట్‌లో 277/1, 277/2లో 2016 వరకు వేసిన లే అవుట్‌లో 2017లో 17 ఎకరాల భూమిని ప్రభుత్వం 22ఏ జాబితాలో పెట్టింది. దీంతో అప్పటి నుంచి కోర్టు వివాదం నడుస్తోంది. వివాదం నడుస్తుండగానే కృష్ణా కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి ఆధ్వర్యంలో కొందరు పెద్దలు లే అవుట్‌లో ఓపెన్ స్పేస్, ఇతర మిగులు భూముల ఆక్రమణకు యత్నించారు. మొత్తంగా రెండు సర్వే నంబర్లలో 850 గజాల స్థలంలో అక్రమంగా నిర్మించిన ఏడు షెడ్లు శనివారం తొలగించారు. అలాగే మధురవాడ కరెంటు ఆఫీసు సమీపంలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత కళాశాల బాలుర వసతి గృహాలు వద్ద స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఆ శాఖ డీడీ రామారావు ఇటీవల జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ స్థలాల్లో నిర్మించిన ఆక్రమణలు కూడా తొలగించారు. ప్రభుత్వ స్థలానికి ట్రంచ్ కొట్టారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ.7 కోట్లు పైమాటే కాగా బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లు పైనే ఉంటుంది. వుడా కాలనీలో జరుగుతున్న ఆక్రమణలకు కూటమికి చెందిన నాయకుడే ప్రధాన సూత్రధారి అన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ సందర్భంగా సదరు నాయకుడు, అతని అనుచరులు రెవెన్యూ అధికారులతోపాటు మీడియా ప్రతినిధులపై దురుసుగా ప్రవర్తించారు. ఆక్రమణల తొలగింపులో సచివాలయ గ్రేడ్–2 వీఆర్‌వోలు వి.సూర్యకిరణ్ కుమార్, ధనలక్ష్మి, దుర్గాప్రసాద్, జగదీశ్వరరావులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ అడ్మిషన్లు

భీమునిపట్నం : భీమిలిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ శనివారం తెలిపారు. డిప్లమో కోర్సులకు సంబంధించి మిగులు సీట్లకు ఈ అడ్మిషన్లు జరుగుతాయని, ఇందులో సీసీఈ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ మొదలైన కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వీటిల్లో చేరే విద్యార్థినులకు ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ సదుపాయం ఉండదని, రూ.5,800 ఫీజు చెల్లించాలని తెలిపారు. అర్హత ఉండి చేరాలనుకునే వారు పదో తరగతి సర్టిఫికెట్, పాలిసెట్ రాసి ఉంటే ఆ వివరాలు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ మొదలైనవి ఒరిజినల్స్, మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు కళాశాల వద్దకు రావాలని కోరారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి గోదాదేవి సన్నిధిలో హారతి ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

క్లుప్తంగా

క్రీడాకారునికి ఆర్థిక సాయం


క్రీడాకారుడు సురేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాసరెడ్డి, తదితరులు

పద్మనాభం : శ్రీ శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో వీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, అతని స్నేహితులు శనివారం రేవిడి గ్రామానికి చెందిన షూటింగ్ బాల్ క్రీడాకారుడు రెల్లి సురేష్‌కు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. అంతర్జాతీయ స్థాయిలో నేపాల్‌లో నిర్వహించనున్న ఆసియా షూటింగ్ బాల్ పోటీలకు సురేష్ ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో సురేష్ నేపాల్ వెళ్లేందుకు ఈ ఆర్థిక సహాయం చేశారు. నేపాల్ వెళ్లేందుకు సుమారు రూ.2లక్షలు అవసరమవుతాయని, ప్రభుత్వం, దాతలు స్పందించి సహాయం అందించి సురేష్‌ను ప్రోత్సహించాలని సంఘం సభ్యులు కోరారు.

దూర విద్య కోర్సులకు అడ్మిషన్లు

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎంఏ ఇంగ్లిష్, ఎంబీఏ, బీఏ, బీకాం, డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి వద్ద నుంచే దూర విద్య విధానంలో ఈ కోర్సులు అభ్యసించే విధంగా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు కోసం www.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆయన సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు 31లోపు అందజేయాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం


బదిలీ అయిన తహసీల్దార్ వెంకటరావును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పద్మనాభం : బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ఎస్. వెంకటరావును కార్యాలయ ప్రాంగణంలో రెవెన్యూ సిబ్బంది, డీలర్లు శనివారం ఘనంగా సన్మానించారు. మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ యోగి, ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శన

ఎంవీపీ పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలోని కళా వేదికపై శాస్త్రీయ, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు. నగరంలోని కిరణ్మయ నృత్యాలయం విద్యార్థులు నృత్యం చేస్తారని తెలిపారు.

మనీ సర్క్యులేషన్ కార్యాలయంలో తనిఖీలు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస కేంద్రంగా పనిచేస్తున్న యూట్యూబ్ సంబంధిత మనీ సర్క్యులేషన్ కార్యాయలంలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మజ్జివలస, లక్ష్మీపురం, శింగనబంద పంచాయతీల నుంచి ఎక్కువ మంది యువత ఇటీవల ఇందులో డబ్బులు చెల్లించి చేరుతున్నారు. నిర్వాహకులు వారికి సభ్యత్వం ఇచ్చి ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా కొన్ని టాస్కులు ఇస్తున్నారు. అవి పూర్తి చేసిన వారి ఖాతాలో డబ్బులు వస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇందులో చాలా మంది చేరుతున్నారు. ఎక్కడో ఒకచోట దీనికి బ్రేకులు పడి నష్టపోతారని జరుగుతున్న ప్రచారంతో పోలీసులు ఈ కార్యాలయాన్ని తనిఖీ చేసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని భీమిలి సీఐ డి.రమేష్ దృష్టికి తీసుకురాగా తనకీ విషయం తెలియదని, పరిశీలిస్తామన్నారు. మనీ సర్క్యులేషన్ సంబంధిత యాప్‌లలో డబ్బులు పోగొట్టుకోవద్దని ఆయన సూచించారు.

బక్కన్నపాలెంలో కొనసాగుతున్న రైతుల నిరసన


బక్కన్నపాలెంలో నిరసన తెలుపుతున్న భూములు కోల్పోయిన రైతులు

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలో సినీ పరిశ్రమ నిర్మించిన హుద్‌హుద్ కాలనీ వద్ద భూములు కోల్పోయిన రైతులు ముగ్గులు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఇక్కడ కొద్ది రోజులుగా అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లు ఇచ్చి న్యాయం చేయాలని కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల రైతులు కోరారు. బుధవారం నుంచి శనివారం వరకు ఇక్కడ వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. బాధిత రైతులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటానికి అండగా ఉంటామని ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఎం.రమణ చెప్పారు. ఇళ్ల కేటాయింపులో వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు బి.పోతురాజు, కె.స్వాతి, ఎస్.సోమమ్మ, సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, కేవీపీఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, కె.నాగరావుజు పాల్గొన్నారు.

క్రేన్ ఢీకొని డీవీస్ కార్మికుడు దుర్మరణం


దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద ప్రమాద స్థలిలో ఉప్పలపాటి మూర్తి మృతదేహం

తగరపువలస : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద సర్వీస్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ కార్మికుడు ఉప్పలపాటి మూర్తి మృతి చెందాడు. క్రేన్ ఢీకొనడంతో ఘటనా స్థలిలోనే దుర్మరణం పాలయ్యాడు. దివీస్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న మూర్తి కంపెనీ పని మీద వ్యాన్‌లో గాజువాక వెళ్లి తిరిగి ఆనందపురం వైపు వస్తుండగా టోల్‌గేట్ వద్ద వాటర్ బాటిల్ కోసం ఆగారు. దీనికోసం రోడ్డు దాటుతున్న మూర్తిని ఆనందపురం వైపు వస్తున్న క్రేన్ బలంగా ఢీకొట్టింది. క్రేన్ ముందు టైరు తల పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మూర్తి 25 సంవత్సరాల క్రితమే దివీస్‌లో ఫిట్టర్‌గా చేరి ప్రస్తుతం భార్య, ఇద్దరు పిల్లలతో తగరపువలసలో నివసిస్తున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ పందిరి శివ చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ టీవీ తిరుపతి రావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు రోజుల్లో రెండో క్రేన్ ప్రమాదం

ఈ నెల 24న వేములవలస మార్కెట్ కూడలి వద్ద క్రేన్ ఢీకొని విశ్రాంత ఎలక్ట్రికల్ ఉద్యోగి షేక్ ఆలీ దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. మళ్లీ ఇక్కడకు సమీపంలోని దుక్కవానిపాలెంలో క్రేన్ ఢీకొని దివీస్ ఉద్యోగి దుర్మరణం చెందడం గమనార్హం. ప్రమాదాల నివారణకు పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం


చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


మారికవలస ఆర్‌జీకే కాలనీలో మొక్క నాటుతున్న ఎంఈవో రవీంద్రబాబు, తదితరులు


రాయప్పాలెం హైస్కూల్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి


మద్ది హైస్కూల్‌లో మొక్క నాటుతున్న విద్యార్థులు


కృష్ణంరాజుపేట స్కూల్‌లో మొక్కల ప్రాధాన్యతపై ప్రచారం చేస్తున్న విద్యార్థులు

మధురవాడ : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని విశాఖ రూరల్ మండల విద్యాశాఖ అధికారి సీహెచ్.రవీంద్రబాబు సూచించారు. శిక్షా సప్తాహ 6వ రోజు కార్యక్రమంలో భాగంగా మారికవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పర్యావరణ, పాఠశాల పోషకాహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యూట్రి గార్డెన్ కార్యక్రమంలో భాగంగా మాతృమూర్తులచే వారి పిల్లల సమక్షంలో మొక్కలు నాటించారు. పిల్లలు, వారి తల్లులతో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. పాఠశాలలో న్యూట్రి గార్డెన్ల నిర్వహణపై వివరించారు. అన్ని తరగతులు సందర్శించి వారితో ముచ్చటించారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా గ్రీన్ క్రాప్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇతర విద్యార్థులు 200 మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు, కమిషనర్ మధుసూదనరావు ప్రారంభించారు. మధుసూదనరావు, సోమేష్, పీడీ రాము, ప్రకాశ్ పాల్గొన్నారు.


మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


పద్మనాభం : శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని పలు పాఠశాలల ప్రాంగణాల్లో శనివారం మొక్కలు నాటారు. బాదేవపురం, అనంతవరం, సంగుపేట, కృష్ణాపురం, కురపల్లి, తునిపాలెం, విజయానందపురం ప్రాథమిక, పాట్నూరు ప్రాథమికోన్నత, మద్ది, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రాంగణాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

తగరపువలస : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని జీవీఎంసీ భీమిలి జోనల్ కమిషనర్ కనకమహలక్ష్మి అన్నారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఆమె శనివారం రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో ఎకో క్లబ్ ఏర్పాటు సందర్భంగా ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతిలో మొక్కల సాగును పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు జె.రాధాకుమారి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి 50 మొక్కలు నాటారు. విద్యార్థులతో ఎకో క్లబ్ ఏర్పాటు చేశారు.

◆ భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ చేశారు. 6 నుంచి 8 వరకు చదువుతున్న విద్యార్థులతో ఎకో క్లబ్ ఏర్పాటు చేసి మొక్కలను దత్తత ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ మొక్కల ప్రాధాన్యతను వివరించారు. ఇళ్లల్లో జరిగే ప్రతి శుభకార్యానికి గుర్తుగా మొక్కలు నాటాలని సూచించారు.

తహసీల్దార్ రామారావు బాధ్యతల స్వీకరణ


శ్యామ్‌ప్రసాద్


పైల రామారావు

భీమునిపట్నం : భీమిలికి కొత్తగా వచ్చిన తహసీల్దార్ పైల రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన గోవింద్ పుసపాటిరేగకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం నుంచి రామారావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షిస్తానని తెలిపారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని వెల్లడించారు.

ఆనందపురం తహసీల్దార్‌గా శ్యామ్‌ప్రసాద్

తగరపువలస : ఆనందపురం మండల తహసీల్దార్‌గా పి.శ్యామ్‌ప్రసాద్ విజయనగరం జిల్లా భోగాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన హేమంత్ కుమార్ ఇటీవల బదిలీ అయిన సంగతి తెలిసిందే. శ్యామ్‌ప్రసాద్ గతంలో పెందుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.


భారతరత్న అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి


కలామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ : దివంగత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహానికి చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దేశానికి కలామ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కమిషనర్ స్కౌట్ మధుసూదనరావు, ఉపాధ్యాయులు సోమేశ్వరావు, పీడీ రాము, ప్రసాదరావు, కె.శ్రీనివాసులు, జి.ప్రకాశ్, అనిల్, భాస్కర్, ఎన్‌జీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ వర్ధంతి సందర్భంగా స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ (సన్) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సన్ అధ్యక్షుడు రాజేటీ బసవ కృష్ణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సూర్యప్రసాద్, గంటా రవితేజ, కర్రి నరేష్, కాకర సురేష్, దల్లై శివ పాల్గొన్నారు.

సూపర్ కంప్యూటర్ నిర్వహణపై సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న హెచ్‌పీసీ మాస్టర్ ట్రైనీ అండ్ ప్రొఫెసర్ వెంకట కిషోర్

ఎంవీపీ పాలెం : ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ అత్యంత ముఖ్యమైనదని హెచ్‌పీసీ మాస్టర్ ట్రైనీ అండ్ ప్రొఫెసర్ ఎం.వెంకట కిషోర్ అన్నారు. జీవీఎంసీ ఆరో వార్డులోని బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో సూపర్ కంప్యూటర్ నిర్వహణపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర శాంకేతిక విజ్ఞాన చరిత్రలో కంప్యూటర్ స్థానం సుస్థిరమైందన్నారు. భారతదేశంలో సూపర్ కంప్యూటింగ్ అనేది ఏఐసీటీఈ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ కంప్యూటర్ విద్యను అభ్యసించే వారికి ఈ సదస్సు ఎంతో ఉపయుక్తమవుతందన్నారు. ప్రిన్సిపాల్ పూర్ణ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాత సామియ్యవలసకు మట్టి రోడ్డే శరణ్యం


పాత సామియ్యవలస వెళ్లేందుకు రాళ్లతో కూడిన మట్టి రోడ్డు

తగరపువలస : పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పాత సామియ్యవలస గ్రామానికి సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ శివారులో గోస్తనీ నదిని ఆనుకుని వసతులు లేని చోట ఈ గ్రామం విసిరేసినట్టు ఉంటుంది. భీమిలి మండలం మజ్జివలస గ్రామం మీదుగా పాత సామియ్యవలసకు రాకపోకలు సాగిస్తుంటారు. మజ్జివలస శివారు నుంచి ఇరువైపులా తుప్పల మధ్య కేవలం రాళ్లతో కూడిన మట్టిరోడ్డే వీరి రాకపోకలకు ఆధారం. ఈ మార్గంలో చీకటి పడితే వీధిదీపాలు కూడా ఉండవు. దీంతో విష పురుగుల మధ్యే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో అయితే గ్రామస్తులు నానా తంటాలు పడుతుంటారు. గోస్తనీనది నీరు మజ్జివలస వరకు ప్రవహిస్తుంది. దీంతో ఈ నీటిలో నుంచే అతి కష్టం మీద రాకపోకలు సాగిస్తుంటారు. పాత సామియ్యవలస గ్రామస్తుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన రహదారితోపాటు మజ్జివలస నుంచి పాత సామియ్యవలస వరకు వీధిదీపాలు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.